ప్రజాశక్తి

శనివారం 11 అక్టోబర్ 2025





రాస్తారోకో నిర్వహిస్తున్న సర్పంచులు, ఎంపీటీసీలు

15వ ఫైనాన్స్ నిధుల కోసం రోడ్డెక్కిన సర్పంచులు

ప్రజాశక్తి-సోమందేపల్లి

15 ఫైనాన్స్ నిధులు తాము విడుదల చేసుకోవడానికి వీలులేకుండా చేశారని ఆగ్రహం వ్యక్తం చేస్తూ మండలంలోని పలువురు సర్పంచులు రోడ్డెక్కారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో పాల్గొన్న మండలంలోని సర్పంచులు 15వ ఆర్థిక సంఘ నిధులు విడుదల విషయంలో అధికారుల తీరును తీవ్ర స్థాయిలో ఎండగట్టారు. ఎంపిడిఒ కార్యాలయం వద్ద నిరసన చేపట్టి అనంతరం గోరంట్ల పెనుగొండ జాతీయ రహదారిపై ఎంపీటీసీ లతో కలిసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో మంత్రి సవితమ్మ తో అధికారులు కుమ్మక్కై 15వ ఆర్థిక సంఘం నిధులను విడుదల చేసుకోవడానికి అవకాశం లేకుండా అడ్డుపడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామాల అభివృద్ధికి కూటమి ప్రభుత్వ ప్రజా ప్రతినిధులు ఆటంకం ఏర్పరుస్తున్నారని విమర్శించారు. కేంద్రం పంచాయతీలకు కేటాయించిన నిధులను విడుదల కాకుండా కూటమి నాయకులు అధికారులు అడ్డుపడటం అన్యాయమన్నారు. చట్టరీత్యా పంచాయతీలకు రావలసిన నిధులు తప్పనిసరిగా వచ్చే విధంగా కూటమి ప్రభుత్వ ప్రజాప్రతినిధులు సహకరించాలన్నారు. లేనిపక్షంలో తమ నిరసనను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. చివరకు ఎస్ఐ రమేష్ బాబు, పెనుకొండ ఎస్ఐ ఆధ్వర్యంలోని పోలీసులు ప్రజా ప్రతినిధుల నిరసనను విరమింప చేశారు. ఈ కార్యక్రమంలో మండలంలోని సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.



ఎంపిడిఒ కార్యాలయం ముందు ధర్నా చేస్తున్న సర్పంచులు, ఎంపీటీసీలు

ప్రభుత్వంపై బురద చల్లడమే : 15వ ఫైనాన్స్ నిధులు విడుదల కావడం లేదని మండలంలోని వైసీపీ సానుభూతి సర్పంచులు రోడ్లెక్కడం కేవలం కూటమి ప్రభుత్వంపై బురద చల్లడానికేనని టిడిపి నాయకులు విమర్శించారు. ఈ సందర్భంగా సగర ఉప్పర కార్పొరేషన్ చైర్మన్ వెంకట్ రాముడు, వాల్మీకి డైరెక్టర్ డివి ఆంజనేయులు, మండల కన్వీనర్ వెంకటేష్, తెలుగుదేశం సానుభూతిపరులైన మాకే చెరువు సర్పంచి నరసింహులు మాట్లాడుతూ గత ప్రభుత్వం నాలుగు సంవత్సరాలలో పంచాయతలకు నిధులు రాకుండా వచ్చిన నిధులను పక్కదారి పట్టించిందన్నారు. అప్పుడు ఒక్క మాట కూడా మెదపని సర్పంచులు సర్వసభ్య సమావేశాన్ని అడ్డుకొని రోడ్లెక్కి గ్రామాల అభివృద్ధికి ఆటంకంగా నిలుస్తున్నారని విమర్శించారు.



అదే ఉత్సాహం



సాంస్కృతిక ఉత్సవాల్లో మాట్లాడుతున్న ఎస్ఎస్బిఎన్ కళాశాల కార్యదర్శి నిర్మల

మహిళల హక్కుల సాధనకు ఐద్వా కృషి అభినందనీయం

ఎస్ఎస్బిఎన్ విద్యా సంస్థల కార్యదర్శి నిర్మల

రెండోవ రోజు కొనసాగిన సాంస్కృతిక ఉత్సవాలు

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

మహిళల హక్కుల సాధనకు ఐద్వా కృషి అభినందనీయమని ఎస్ఎస్బిఎన్ విద్యాసంస్థల కార్యదర్శి నిర్మల పేర్కొన్నారు. అనంతపురం జిల్లాలో ఈ నెల 13, 14, 15 తేదీల్లో జరగనున్న ఐద్వా 16వ రాష్ట్ర మహాసభల నేపథ్యంలో కృష్ణకళామందిరంలో నిర్వహించిన సాంస్కృతిక ఉత్సవాలు శుక్రవారం ఆద్యంతం ఆకట్టుకున్నాయి. ప్రదర్శించిన ఫోటో ఎగ్జిబిషన్‌ను ప్రముఖులు సందర్శించి అక్కడ ఉన్న క్యూఆర్ కోడ్‌తో తమ అభిప్రాయాలను పంచుకున్నారు. రెండవ రోజు నిర్వహించిన సాంస్కృతిక ఉత్సవాలు రెట్టింపు ఉత్సాహంతో కొనసాగాయి. డ్యాన్స్ మాస్టర్ వన్నూరు స్వామి ఆహ్వానితులుగా కొనసాగిన కార్యక్రమానికి ఎస్-ఎస్బిఎన్ విద్యా సంస్థల కార్యదర్శి నిర్మల ముఖ్య అతిథిగా హాజరై సాంస్కృతికఉత్సవాలను ప్రారంభించారు. రచయిత షేక్ రియాజుద్దీన్ వేమన పద్యగానం చేశారు.

మహిళల హక్కుల పరిరక్షణకు ఐద్వా కృషి ఆదర్శం

సమాజంలో మహిళలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం, వారి హక్కుల పరిరక్షణ కోసం ఐద్వా చేస్తున్న కృషి ఆదర్శనీయమని ఎస్ఎస్బిఎన్ విద్యా సంస్థల కార్యదర్శి నిర్మల అన్నారు. మహిళలకు ఎక్కడ సమస్యలు ఎదురైనా రక్షణగా ఐద్వా ముందుండి పోరాడుతోందన్నారు. ప్రశ్నించడంతో పాటు పోరాడే పటిమతో ఐద్వా అందరికి చేరువైందన్నారు. అన్యాయం జరిగినప్పుడు గొంతెత్తి బాధితుల పక్షాన తామున్నామంటూ నిలబడుతున్నారని తెలిపారు. ఐద్వా రాష్ట్ర మహాసభల సందర్భంగా సాంస్కృతికఉత్సవాలు నిర్వహించడం అభినందనీయమన్నారు.

ఆకట్టుకున్న సాంస్కృతిక ప్రదర్శనలు

ఐద్వా సాంస్కృతిక ఉత్సావాల్లో భాగంగా విద్యార్థినుల కళా ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. సంధ్యామూర్తి శిష్యబృందం ప్రదర్శించిన భరతనాట్యం, డ్యాన్స్ మాస్టర్స్ వన్నూరు, విష్ణు శిష్యులు ప్రదర్శించిన నృత్యాలు, రూట్స్ పబ్లిక్ స్కూల్ విద్యార్థినులు ప్రదర్శించిన ముఖాభినయం, గుంతకల్ విద్యార్థినిలు ప్రదర్శించిన వరకట్నం వేధింపులపై ప్రదర్శించిన నాటిక, ఆలోచింపజేశాయి. ఫోక్ డ్యాన్, క్లాసికల్, మైమ్ ప్రదర్శనలు చేశారు. తరిమెల రాజు, పవన్ నిర్మించిన డ్రగ్‌ఫ్రీ ఇండియా లఘుచిత్రాన్ని ఈనెల 19న ఎన్‌మ్యాక్స్ థియేటర్‌లో ప్రదర్శిస్తున్న సందర్భంగా బ్రోచర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఐద్వా జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు శ్యామల, చంద్రిక, నగర కార్యదర్శి అశ్విని, జిల్లా నాయకులు రామాంజినమ్మ, శైలజ, గీత, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు గిరి, పరమేష్, ప్రజానాట్య మండలి శ్రీనివాసులు బృందం తదితరులు పాల్గొన్నారు.

ఐద్వా రాష్ట్ర మహాసభల గోడపత్రిక ఆవిష్కరణ

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) ఆధ్వర్యంలో ఈ నెల 13, 14, 15 తేదీల్లో అనంతపురం నగరంలో నిర్వహిస్తున్న 16వ రాష్ట్ర మహాసభల గోడపత్రికలను శుక్రవారం విడుదల చేశారు. ఐద్వా రాష్ట్ర కోశాధికారి వి.సావిత్రి, జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు శ్యామల, చంద్రిక తదితరులు శుక్రవారం గణేనాయక్ భవన్‌లోని ఐద్వా కార్యాలయంలో మహాసభల పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఐద్వా రాష్ట్ర కోశాధికారి సావిత్రి మాట్లాడుతూ మహిళాభివృద్ధికి ఐద్వా చేస్తున్న పోరాటాలను వివరించారు. ఆస్తి హక్కు, వరకట్న వేధింపుల నిరోధక చట్టం, లైంగిక వేధింపుల నిరోధక చట్టం, నిర్భయ గృహ హింస వంటి అనేక చట్టాలను సాధించుకోవడానికి అనేక ఉద్యమాలను ఐద్వా చేపట్టిందని గుర్తు చేశారు. కేవలం లింగ సమానత్వం మాత్రమే కాదు జాతీయ, మత, కుల, ప్రాంత, భాషా భేదాలకు వ్యతిరేకంగా పోరాడే ప్రగతిశీల మహిళా ఉద్యమం ఐద్వా అని ఆమె తెలిపారు. 13న నగరంలో భారీ ర్యాలీ, అదే రోజున లలితకళాపరిషత్‌లో బహిరంగ సభ ఉంటుందన్నారు. 14, 15 తేదీల్లో ప్రతినిధుల సభ ఉంటుందన్నారు. ఈ మహాసభలకు ఐద్వా ఆలిండియా కార్యదర్శి మరియం దావలె, కేరళ మాజీ మంత్రి శ్రీమతి, సామాజికవేత్త, హైకోర్టు న్యాయవాది సీస్తాశీతల్వాద్ ముఖ్య అతిథులుగా హాజరవుతారని చెప్పారు. అక్టోబర్ 13, 14,15 తేదీలలో నగరంలో జరుగుతున్న 16వ రాష్ట్ర మహాసభల్లో జిల్లా వాసులందరూ పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఐద్వా నగర కార్యదర్శి అశ్విని, జిల్లా నాయకురాలు రామాంజినమ్మ, అక్కమ్మ, వెంకటరమణమ్మ, సునంద, కృష్ణవేణి, రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.



రాష్ట్ర మహాసభల పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఐద్వా నాయకురాళ్లు



డిఎఫ్ఐ షార్ట్‌ఫిలిం పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ప్రముఖులు



నృత్యకళాకారిణిలను ప్రశంసాపత్రం,షీల్డ్ అందజేస్తున్న అతిథులు



ఉత్సవాలకు హాజరైన మహిళలు

అంగన్వాడీ ఆయా ఆత్మహత్య

ప్రజాశక్తి-సోమందేపల్లి

మండల పరిధిలోని చల్లా పల్లి అంగన్వాడీ కేంద్రంలో హెల్పర్ గా పనిచేస్తున్న శిల్ప (32) శుక్రవారం ఆత్మహత్యకు పాల్పడింది. స్థానికులు తెలిపిన వివరాలు... అంగన్వాడీ ఆయా శిల్ప భర్త నరేష్ ఒక గుడిలో పూజారిగా విధులు నిర్వహిస్తున్నాడు. వీరికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఈ నేపథ్యంలో శిల్ప శుక్రవారం తన ఇంటిలోని బాత్రూంలో తాడుతో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకుంది. ఈమె ఆత్మహత్యకు కుటుంబ కలహాలని కొందరు, అనారోగ్యసమస్య అని మరికొందరు అభిప్రాయ పడుతున్నారు. అయితే నిజా నిజాలు పోలీసులు దర్యాప్తులో తేలాల్సింది. అంగన్వాడీ ఆయా శిల్ప మృతితో సిడిపిఒ శాంతలక్ష్మి ఆధ్వర్యంలో మట్టి ఖర్చులకే ప్రభుత్వం అందజేసే 15 వేల రూపాయలు అందించారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్వైజర్ సుభారాణి, సిఐటియు నాయకురాలు శ్రీదేవి, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

నేటి నుంచి 'పురం'లో బాలయ్య పర్యటన

ప్రజాశక్తి-హిందూపురం

స్థానిక ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ శనివారం నుంచి మూడు రోజులపాటు నియోజకవర్గంలో పర్యటిస్తున్నట్లు ఎమ్మెల్యే వ్యక్తిగత కార్యదర్శులు శుక్రవారం తెలిపారు. శనివారం సాయంత్రం హిందూపురం జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యులతో సమీక్ష సమావేశం నిర్వహిస్తారన్నారు. సాయంత్రం 6 గంటలకు పట్టణంలోని ఆర్ అండ్ బి అతిథిగృహంలో జిల్లా కలెక్టర్, రెవెన్యూ అధికారులతో కలిసి ఏపీఐఐసి అధికారులతో సమీక్ష సమావేశంలో పాల్గొంటారని చెప్పారు. ఆదివారం ఉదయం 9 గంటలకు చిలమత్తూరు పంచాయతీ తుమ్మలకుంటలో స్మార్ట్ కార్డులు పంపిణీ కార్యక్రమంలో పాల్గొనిఅనంతరం ఎమ్మెల్యే కార్యాలయంలో పురపాలక సంఘ అభివృద్ధి గురించి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహిస్తారని వివరించారు. సాయంత్రం నాలుగు గంటలకు నియోజకవర్గ వ్యాప్తంగా 69 మందికి రూ 45 లక్షల విలువైన ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను పంపిణీ చేస్తారన్నారు. సోమవారం ఉదయం రూరల్ మండలం కిరికెర పంచాయతీ బసవన్నపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రూ 64 లక్షలతో నిర్మాణం చేసిన తరగతి గదులను ప్రారంభిస్తారని బసవన్నపల్లి నుండి భరత్ నగర్ వరకు రూ. కోటి రూపాయలతో నూతనంగా వేసిన బీటీ రోడ్డును ప్రారంభిస్తారని చెప్పారు. అనంతరం రహమత్‌పురం కెజిబివి పాఠశాలలో రూ.1. 20 కోట్లతో నిర్మాణం చేస్తున్న అదనపు భవనాల కోసం భూమి పూజ చేసి పనులను ప్రారంభిస్తారన్నారు. ఈ కార్యక్రమం అనంతరం జిఎస్టి తగ్గింపు పై చిన్న మార్కెట్ నుండి అంబేద్కర్ సర్కిల్ వరకు జరిగే ర్యాలీలో బాలకృష్ణ పాల్గొంటారని వివరించారు. కూటమి నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని ఆయా కార్యక్రమాలను విజయవంతం చేయాలని వారు కోరారు.

నారాయణ పాఠశాలకు షోకాజ్ నోటీసు

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం పట్టణంలోని నారాయణ పాఠశాలకు శుక్రవారం మండల విద్యాశాఖ అధికారి గంగప్ప షోకాజ్ నోటీసు జారీ చేశారు. ఇటీవల నారాయణ పాఠశాల యాజమాన్యం స్కాలర్ షిప్ పేరిట ఎంట్రన్స్ పరీక్ష పెట్టారని, పిల్లలను ప్రచారానికి ఇంటికి పంపిస్తున్నారని విద్యార్థి సంఘం నాయకులు విద్యాశాఖ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో అందుకు సంబంధించి పూర్తి వివరాలతో సంజాయిషీ ఇవ్వాలని యాజమాన్యానికి గంగప్ప నోటీసు అందజేశారు.

'టెండర్లు రద్దు చేసి.... కాంట్రాక్టర్లను బ్లాక్ లిస్టులో పెట్టండి '

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం పురపాలక సంఘంలో జరిగిన అభివృద్ధి పనుల్లో అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న ఇద్దరు కాంట్రాక్టర్లు వేసిన టెండర్లను రద్దుచేసి... ఆ ఇద్దరిని బ్లాక్ లిస్టులో పెట్టాలని న్యాయవాది గోవిందరాజులు మున్సిపల్ కమిషనర్ మల్లికార్జునను కోరారు. ఈ మేరకు ఆయన శుక్రవారం హిందూపురం మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున ను కలిసి ఈ విషయంపై సమగ్ర ఆధారాలతో ఫిర్యాదు చేశారు. అనంతరం గోవిందరాజులు మాట్లాడుతూ, హిందూపురపాలక సంఘంలో అభివృద్ధి పనులు చేపడుతున్న ఇద్దరు కాంట్రాక్టర్లపై ఇప్పటికే లోకాయుక్తలో ఫిర్యాదు చేయడం జరిగిందన్నారు. అవినీతికి పాల్పడుతున్న కాంట్రాక్టర్లను బ్లాక్ లిస్టులో పెట్టకుండా యధావిధిగా టెండర్లలో పాల్గొనే విధంగా అధికారులు అవకాశం కల్పిస్తున్నారని విమర్శించారు. ఇప్పటికైనా ఈ కాంట్రాక్టర్లపై అధికారులు శాఖపరమైన చర్యలు తీసుకోకపోతే ప్రజాధనాన్ని పరిరక్షించడానికి కోసం ఉన్నత న్యాయస్థానాలకైనా వెళ్లడానికి సిద్ధంగా ఉన్నానన్నారు.

న్యాయవాదిపై చర్యలు తీసుకోవాలి : బిఎస్పి

ప్రజాశక్తి-హిందూపురం

భారత ప్రధాన న్యాయమూర్తి బి.ఆర్.గవాయ్ పై దాడి చేసిన న్యాయవాదిపై కఠిన చర్యలు తీసుకోవాలని బహుజన్ సమాజ్ పార్టీ నాయకులు డిమాండ్ చేశారు. గవాయ్ పై దాడి చేసిన న్యాయవాదిపై చర్యలు తీసుకోవాలని ఆ పార్టీ నాయకులు శుక్రవారం పార్టీ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బిఎస్పీ రాష్ట్ర కార్యదర్శి శ్రీరాములు మాట్లాడుతూ సనాతన ధర్మ పరిరక్షణ పేరుతో న్యాయమూర్తి పై దాడికి ప్రయత్నం అత్యంత హేయమైన చర్య అన్నారు. ఈ కార్యక్రమంలో బిఎస్పీ నాయకులు శ్రీనివాసులు, సుబ్బరాయప్ప, కొండప్ప, శివకుమార్, కుమార్, మౌలాలీ, బాబు, నారాయణప్ప, నాగరాజు, తిప్పన్న, తదితరులు పాల్గొన్నారు.

మానసిక వికలాంగుల్లో ధైర్యం నింపాలి

ప్రజాశక్తి-హిందూపురం

మానసిక వికలాంగుల్లో ధైర్యం నింపి సమాజంలో బతకగలిగే స్థాయికి తీసుకురావాలని సీనియర్ సివిల్ జడ్జి డి వెంకటేశ్వర్లు నాయక్, ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ అన్నపూర్ణ, మానసిక వైద్య నిపుణులు రాజగోపాల్, జీవన పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక జిల్లా స్థాయి ప్రభుత్వాసుపత్రిలో ప్రపంచ మానసిక వికలాంగుల దినోత్సవ వారోత్సవాల్లో భాగంగా మండల న్యాయ సేవాధికారి సంస్థ ఆధ్వర్యంలో న్యాయవిజ్ఞాన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ప్రతి ఏటా అక్టోబర్ 4వ తేదీ నుండి 10వ తేదీ వరకు ప్రపంచ మానసిక వికలాంగ దినోత్సవ వారోత్సవాలను నిర్వహించడం జరుగుతోందన్నారు. మానసిక వికలాంగుల ఆరోగ్య పరిస్థితులను చక్కబెట్టేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నో విభిన్న పథకాలను అమలు చేస్తున్నట్లు తెలిపారు. హిందూపురం ప్రభుత్వాసుపత్రిలో ప్రత్యేక మానసిక వికలాంగులకు సంబంధించి ప్రత్యేక సదుపాయాలు కూడా ఉన్నాయన్నారు. ప్రభుత్వ సదుపాయాలను సద్వినియోగం చేసుకుంటూ మానసిక వికలాంగులందరూ సంపూర్ణ ఆరోగ్యవంతులుగా సమాజంలో జీవించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ శ్రీధర్, న్యాయవాదులు శ్రీనివాసరెడ్డి, సంతోషి కుమారి, నవేరా, పవిత్ర, అజయ్, లో క్ అదాలత్ సిబ్బంది హేమావతి, రాజు తదితరులు పాల్గొన్నారు.

యువత లక్ష్యసాధన దిశగా ముందుకెళ్లాలి

కలెక్టర్ ఏ.శ్యామ్ ప్రసాద్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్యాంప్రసాద్

ప్రజాశక్తి-హిందూపురం

యువత లక్ష్యసాధన దిశగా ముందుకెళ్లాలని జిల్లా కలెక్టర్ ఏ. శ్యాం ప్రసాద్ పిలుపునిచ్చారు. చిత్తశుద్ధితో కష్టపడి పని చేస్తే తప్పకుండా విజయం సాధించవచ్చని సూచించారు. శుక్రవారం జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో పట్టణంలోని ఎస్.డి.జి.ఎస్ కళాశాలలో ఏర్పాటు చేసిన మెగా జాబ్ మేళాను కలెక్టర్ తో పాటు మున్సిపల్ చైర్మన్ డిఈ రమేష్ కుమార్, జిల్లా టిడిపి అధ్యక్షులు వడ్డే అంజనప్ప, తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త పావులూరు శ్రీనివాసరావు తదితరులు ప్రారంభించారు. ఈ సందర్భంగాకలెక్టర్ మాట్లాడుతూ హిందూపురం నియోజక వర్గంలో స్కిల్ డెవలప్ మెంట్ ఆధ్వర్యంలో నిర్వహించే జాబ్ మేళాను నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. జిల్లాలోని అన్ని నియోజకవర్గలలో స్కిల్ హబ్ సెంటర్ ను ఏర్పాటు చేశామని, అక్కడికి వెళ్లి నైపుణ్యాలను పెంపొందించుకోవాలని కోరారు. ప్రస్తుతం ఉన్న జాబ్ మార్కెట్ ఆధారంగా యువతీ, యువకుల నైపుణ్యాలను మెరుగుపరుచుకోవాలన్నారు. సత్య సాయి జిల్లాలో రాబోయే రోజులలో కియా లాంటి పరిశ్రమలు రాబోతున్నాయని, వాటికీ అనుగుణంగా నైపుణ్యాలు పెంపొందించుకోవాలని సూచించారు. అలాగే యువతీ, యువకులకు సోలార్ రంగంలో శిక్షణలు ఏర్పాటు చేస్తామన్నారు. ఈసందర్భంగా వివిధ ప్రాంతాలకు చెందిన 15 బహుళ జాతి కంపెనీలు హాజరై విద్యార్హత మేరకు విద్యార్థులను ఉద్యోగాల కోసం ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఎంపికైన అభ్యర్థులకు వివిధ ప్రాంతాల్లో ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నట్లు తెలిపారు. ఈ మెగా జాబ్ మేళాలో జిల్లా పరిశ్రమల అధికారి నాగరాజు, జిల్లా నైపుణ్య అభివృద్ధి సంస్థ అధికారి హరికృష్ణ, కళాశాల కరస్పాండంట్ బైసాని రాం ప్రసాద్, మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున, కళాశాల ప్రిన్సిపల్ నాగేంద్ర కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కరపత్రాలు విడుదల : హిందూపురం ఎస్.డి.జి.ఎస్ కళాశాలలో శుక్రవారం కలెక్టర్ శ్యాంప్రసాద్ తదితరులు సూపర్ జిఎస్టీ సూపర్ సేవింగ్స్ కరపత్రాలను విడుదల చేశారు. ముఖ్యంగా విద్యార్థులు, వ్యాపారులు, అన్ని వర్గాలు కేంద్ర ప్రభుత్వం తగ్గించిన జిఎస్టీ పై అవగాహన కల్పించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో చాంబర్ ఆఫ్ కామర్స్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

పారదర్శకంగా సదరం శిబిరం నిర్వహణ

ప్రభుత్వాసుపత్రికి వచ్చే వైద్యులు రోగులతో ఆప్యాయంగా మాట్లాడి వైద్య సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ ఏ.శ్యాంప్రసాద్ సూచించారు. శుక్రవారం హిందూపురం ప్రభుత్వాసుపత్రిలో ఏర్పాటు చేసిన విభిన్న ప్రతిభావంతుల సదరం క్యాంపును, ఆసుపత్రిలోని వివిధ విభాగాలను కలెక్టర్ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ అన్నపూర్ణ, డి.సి.హెచ్.ఎస్ డాక్టర్ మధుసూదన్, ఆర్ఎఒ డాక్టర్ లక్ష్మీ రామ్ నాయక్, స్థానిక ఎమ్మెల్యే పీఏ వీరయ్య, వైద్యులు, వైద్యాధికారులు, తదితరులు పాల్గొన్నారు.

పట్టు సాగులో జిల్లాను ప్రథమ స్థానంలో నిలపాలి : పట్టు సాగులో జిల్లాను ప్రథమ స్థానంలో నిలపాలని, ఇందుకు అధికారులు, రైతులు సమన్వయంగా కృషి చేయాలని జిల్లా కలెక్టర్ ఏ. శ్యాం ప్రసాద్ సెరికల్చర్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం హిందూపురం పట్టణంలోని ప్రభుత్వ పట్టుగూళ్ల విక్రయ కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఈ-వేలం, ఈ-మార్కెటింగ్ ప్రక్రియను పరిశీలించారు. అక్కడున్న పట్టు రైతులతో మల్బరీ తోటల నిర్వహణ, పట్టుగూళ్ల ఉత్పత్తి గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో పట్టు శాఖ జిల్లా సంయుక్త సంచాలకులు శోభారాణి, హిందూపురం సహాయ సంచాలకులు ఏ.రత్నం, పట్టు శాఖ సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.


అటవీ ప్రాంతంలో సీడ్ బాల్స్ చల్లుతున్న ఎమ్మెల్యే, విద్యార్థులు, అధికారులు

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-మడకశిర టౌన్

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని ఎమ్మెల్యే ఎం.ఎస్.రాజు, మాజీ ఎమ్మెల్యే గుండుమల తిప్పేస్వామి పిలుపునిచ్చారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా మడకశిర వాసవీ యువత సంఘం విద్యార్థుల సహకారంతో సిద్ధం చేసిన 10వేల సీడ్‌బాల్స్‌ను శుక్రవారం ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యే ఆధ్వర్యంలో భూతప్పకొండ సమీప అటవీ ప్రాంతంలో చల్లారు. వారు మాట్లాడుతూ ప్రస్తుత వాతావరణంలో ఏర్పడుతున్న విపత్కర పరిస్థితుల దృష్ట్యా ప్రతి ఒక్కరూ విరివిగా మొక్కలు నాటి పరిరక్షించాలని కోరారు. ముఖ్యంగా యువత ఇలాంటి కార్యక్రమాలు చేపట్టాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో అటవీ శాఖ అధికారులు, శ్రీ స్కూల్ విద్యార్థులు పాల్గొన్నారు.


ఎంఇఒలకు వినతి పత్రం ఇస్తున్న ఫ్యాప్టో నాయకులు

బోధనేతర కార్యక్రమాలు బహిష్కరణ : ఫ్యాప్టో

ప్రజాశక్తి-ఓబుళదేవరచెరువు

ఫ్యాప్టో రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు ఈ నెల 10వ తేదీ నుంచి మండలంలో అన్ని ప్రభుత్వం పాఠశాలల్లో బోధనేతర పనులను బహిష్కరిస్తున్నామని ఫ్యాప్టో నాయకులు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఎంఇఒలు సురేష్ బాబు, రమణలకు వినతి పత్రం ఇచ్చారు. వారు మాట్లాడుతూ ఈ నెల 10వ తేదీ నుంచి పాఠశాలల్లో ఉపాధ్యాయులు కేవలం ఉపాధ్యాయులు, పిల్లల హాజరు, మధ్యాహ్న భోజనం పనులు, పరీక్షల నిర్వహణ, మూల్యాంకనం, బోధన వంటి పనులు మాత్రమే చేస్తారని, మిగతా బోధనేతర పనులన్నీ బహిష్కరిస్తున్నామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఫ్యాప్టో జిల్లా జనరల్ సెక్రటరీ గౌస్ లాజం, నాయకులు సోమశేఖర్‌నాయక్, రామ్‌కుమార్, మనోహర్, మధుసూదన్‌రెడ్డి, వెంకట చలమయ్య, శ్రీనివాసులు, మహేందర్‌రెడ్డి, చంద్రమౌళి, నాగరాజు, శ్రీనివాసులు, ఓబులేసు, ఈశ్వరయ్య, సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.


కార్యక్రమంలో మాట్లాడుతున్న డీఎస్పీ విజయ్‌కుమార్

సైబర్ నేరాలపై జాగ్రత్త : డీఎస్పీ

ప్రజాశక్తి-కొత్తచెరువు

ఇటీవల కాలంలో మొబైల్ ఫోన్లు, ఫోన్ల యాప్‌ల ద్వారా సైబర్ నేరాలు ఎక్కువగా జరుగుతు న్నందున ప్రజలు తగిన జాగ్రత్తలు పాటించాలని పుట్టపర్తి డీఎస్పీ విజయ్‌కుమార్ సూచించారు. స్థానిక బిసి కాలనీలోని ఎస్సీ హాస్టల్‌లో శుక్రవారం సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పోక్సో, మహిళల వేధింపుల కేసులపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. లైసెన్స్ లేకుండా, మద్యం తాగి వాహనం నడపకూడదని, అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. పిల్లలను బాగా చదివించడమే కాకుండా తగిన జాగ్రత్తలు సూచించాలన్నారు. కార్యక్రమంలో అప్‌గ్రేడ్ స్టేషన్ సిఐ మారుతిశంకర్, పోలీసులు, కాలనీ ప్రజలు పాల్గొన్నారు.

పంటకోత ప్రయోగాలపై శిక్షణ

ప్రజాశక్తి-గోరంట్ల

స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో శుక్రవారం రైతు సేవా కేంద్రం సిబ్బందికి పంటకోత ప్రయోగా లపై శిక్షణ ఇచ్చారు. మండల వ్యవసాయ అధికారి శంకర్‌నాయక్ మాట్లాడుతూ మండలంలో ఖరీఫ్-2025కు గ్రామ యూనిట్‌గా కంది, ఉలవ పంటల్లో పంటకోత ప్రయోగాలు చేయాల్సి ఉందన్నారు. ఈ క్రాప్ బుకింగ్ గడువు ఈ నెల 25వ తేదీ వరకూ పొడిగించారని, నిర్ణీత సమయంలో వంద శాతం పూర్తి చేయాలన్నారు. అన్నదాత సుఖీభవ రెండో విడత నగదు త్వరలో బ్యాంకు ఖాతాల్లో జమ అవుతుందని, ఎన్‌పిసిఐ లింక్ లేని రైతులు నెలాఖరు లోపు లింక్ చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎఇఒలు, ఎఎస్‌ఒలు, రైతు సేవా కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

జిఎస్‌టిపై అవగాహన

గోరంట్ల : జిఎస్‌టి సంస్కరణల కారణంగా కలిగే ప్రయోజనాలపై శుక్రవారం పట్టణంలోని శ్రీకృష్ణదేవ రాయ జూనియర్, ఎస్‌పివిఎం డిగ్రీ కళాశాలలు సంయుక్తంగా విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ పిఒలు ఆజాద్, బాలమోహన్ పర్యవేక్షణలో ఏర్పాటు చేసిన సదస్సులో ఆయా కళాశాలల ప్రిన్సిపల్స్ విజయలక్ష్మి, భక్తవత్సలం నిత్యావసర వస్తువులు, ఎలక్ట్రానిక్ పరికరాలు, వైద్యం, వైద్య పరికరాలు, మందులు, బీమా, తదితర వాటిపై తగ్గించిన జిఎస్‌టి గురించి వివరిం చారు. అనంతరం విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు కవిత, శ్వేత, ధనమ్మ, విద్యార్థులు పాల్గొన్నారు.

పోలీసుల కార్డెన్ సెర్చ్

ధర్మవరం రూరల్ : పట్టణంలోని కేతిరెడ్డి, ఇందిరమ్మ కాలనీల్లో శుక్రవారం టూ టౌన్ సిఐ రెడ్డప్ప ఆధ్వర్యంలో పోలీ సులు కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. పాత నేరస్తులు, అనుమానితులు, కొత్త వ్యక్తుల ఇళ్లల్లో సోదాలు చేశారు. కాలనీల్లో కొత్త వ్యక్తులు అనుమానాస్పదంగా కనిపిస్తే వెంటనే డయల్ 100కు సమావచారం ఇవ్వాలన్నారు. ఇల్లు అద్దెకు ఇచ్చేటప్పుడు వారి ఆధార్, ఓటర్ కార్డు, డ్రైవింగ్ లైసెన్స్, ఏదైనా గుర్తింపు కార్డు చెక్ చేయడంతో పాటు వారి పూర్వాపరాలు తెలుసుకున్న తర్వాతనే ఇల్లు అద్దెకు ఇవ్వాలన్నారు. నంబర్ ప్లేట్ లేకుండా బైక్‌లు, వాహనాలు నడుపుతున్నా పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు.

శివాజీ విగ్రహం ఏర్పాటుకు అనుమతివ్వాలని వినతి

ఓబుళదేవరచెరువు : స్థానిక ఇండేన్ పెట్రోల్ బంక్ కూడలిలో ఛత్రపతి శివాజీ విగ్రహం ఏర్పాటు చేసేందుకు అనుమతి ఇవ్వాలని కోరుతూ శుక్రవారం తహశీల్దార్ శ్రీనివాస్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ శివాజీ విగ్రహం ఏర్పాటు చేసేందుకు కులాలు, పార్టీలకు అతీతంగా ఏకం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ప్రభాకర్‌రెడ్డి, రామచంద్ర, హరికృష్ణ, రంగారెడ్డి, నరేష్‌బాబు, జగదీష్, చంద్ర, కిష్టప్ప, అశ్వర్థప్ప, నీలకంఠారెడ్డి, అరవింద్, విష్ణు, రామాంజి, రమణారెడ్డి, నరేష్ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక

బత్తలపల్లి : మండలంలోని మాల్యవంతం జడ్పీ హైస్కూల్ విద్యార్థులు రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు ఎంపికై నట్లు హెచ్ఎం చెన్నకృష్ణారెడ్డి, పిడి నాగరాజు తెలిపారు. పాఠశాలలో శుక్రవారం వారు మాట్లాడుతూ అనంతపురంలోని ఇండోర్ స్టేడియంలో ఇటీవల స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరిగిన జిల్లా స్థాయి జిమ్నాస్టిక్ పోటీల్లో 8వ తరగతి విద్యార్థినులు నందన కుమారి, అశ్వని, 9వ తరగతి విద్యార్థి రాము ఫార్వర్డ్, బ్యాక్ వర్డ్, స్కైరోల్ పోటీల్లో ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారని తెలిపారు. వీరిని హెచ్‌ఎం, పిడి, ఎస్ఎంసి ఛైర్మన్ ఈశ్వర్‌నాయుడు, ఉపాధ్యాయులు అభినందించారు.


రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

త్వరలో ఎస్ఐను నియమిస్తాం : ఎస్పీ

ప్రజాశక్తి-గాండ్లపెంట

స్థానిక పోలీస్‌స్టేషన్‌కు త్వరలోనే నూతన ఎస్ఐను నియమిస్తామని ఎస్పీ సత్యకుమార్ స్పష్టం చేశారు. ఏప్రిల్, మే నెలలో బదిలీలు చేపడతామని తెలిపారు. పోలీస్‌స్టేషన్‌ను శుక్రవారం ఎస్పీ సందర్శించి రికార్డులను పరిశీలించారు. పెండింగ్‌లో ఉన్న కేసులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. ఎస్పీ విలేకరులతో మాట్లాడుతూ ఈ స్టేషన్‌లో దాదాపు ఏడాదిగా ఎస్ఐ లేకపోవడంతో సమస్యలు ఉన్న మాట వాస్తవమే అన్నారు. 15 రోజుల్లో నూతన ఎస్ఐ నియమిస్తామని స్పష్టం చేశారు. గాండ్లపెంటతో పాటు కొన్ని గ్రామాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తామన్నారు. పంచాయతీ ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని గ్రామాల్లో అసాంఘిక కార్యక్రమాలు, ఘర్షణలు జరగకుండా నిఘా ఏర్పాటు చేస్తామన్నారు. సిబ్బంది స్టేషన్‌లో ఎక్కువ రోజులు ఉన్నందువల్ల వారిని వచ్చే ఏడాది ఏప్రిల్ లేదా మే నెలలో బదిలీల ప్రక్రియ చేపడతామని తెలిపారు. ఆయన వెంట కదిరి డీఎస్పీ వీరనారాయణస్వామి, సిఐ నాగేంద్ర, ఎఎస్ఐ వెంకట్రాముడు, జమేదార్ రామయ్య, తిరుమలరెడ్డి, భాస్కర్, రాజు, మురళి, రవికుమార్, సుధాకర్‌రెడ్డి, నరసింహ, బాషా ఉన్నారు. అనంతరం ఎస్పీ నల్లచెరువు వెళ్లి పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేశారు.


రికార్డులను పరిశీలిస్తున్న ఎస్పీ సత్యకుమార్

బాలికలు లక్ష్యంతో చదవాలి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-చెన్నేకొత్తపల్లి

అమ్మాయిలు చదువుకునే సమయంలోనే ఒక ఉన్నతమైన లక్ష్యాన్ని పెట్టుకుని దానిని సాధించేందుకు కష్టపడి చదవాలని ఎమ్మెల్యే పరిటాల సునీత సూచించారు. స్థానిక మోడల్ స్కూల్‌లో శుక్రవారం అంతర్జాతీయ బాలికల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే పరిటాల సునీత, ధర్మవరం ఆర్డీవో మహేష్, సిఐ శ్రీధర్, అధికారులు పాల్గొన్నారు. ఆటల పోటీల్లో విజేత విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం అన్ని విధాలు గా అమ్మాయిల చదువును ప్రోత్సహిస్తోందని, వాటిని బాలికలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇటీవల నిర్వహించిన డీఎస్సీలో ఎక్కువమంది మహిళలు ఉపాధ్యాయులుగా వచ్చారని, అలాంటి వారిని స్ఫూర్తిగా తీసుకొని ముందుకెళ్లాలన్నారు. పాఠశాలలో నెలకొన్న సమస్యలను పరిష్కరిస్తామని తెలిపారు. అనంతరం స్థానిక కెజిబివిలో రూ. 2.25 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న ఇంటర్మీడియట్ అదనపు భవనాల నిర్మాణాల పనులను ఎమ్మెల్యే, ఆర్డీవో పరిశీలించారు. భవనాల నిర్మాణం నాణ్యతగా ఉండాలని, గడువులోపు పూర్తి చేయాలని ఆదేశించారు.


ఎమ్మెల్యే సునీతకు పూలమొక్క అందజేస్తున్న విద్యార్థినులు

పాత్రికేయులపై ఎంపిడిఒ అనుచిత వ్యాఖ్యలు!

ప్రజాశక్తి-చిలమత్తూరు

చిలమత్తూరు ఎంపిడిఒ రమణమూర్తి చేసిన వ్యాఖ్యలు మరోసారి వివాదాస్పదంగా మారాయి. ఆయన పాత్రికేయులపై అసభ్య పదజాలం వాడుతూ చేసిన అనుచిత వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ప్రజల సమస్యలను ప్రభుత్వం, అధికారుల దృష్టికి తీసుకెళ్లేందుకు కథనాలు, వార్తలు రాసే విలేకరులపై ఎంపిడిఒ చేసిన అనుచిత వ్యాఖ్యలపై చిలమత్తూరు విలేకరుల సంఘం మండిపడింది. ఎంపిడిఒపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ ఎస్ఐ మునీర్‌అహ్మద్‌కి ఫిర్యాదు చేశారు. ఎంపిడిఒ బేషరతుగా పాత్రికేయులకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో శ్రీధర్, ఆంజనేయులు, నరసింహారెడ్డి, విశ్వనాథ్, నారాయణస్వామి, తదితరులు పాల్గొన్నారు. ఇటీవల సమ్మె నోటీసు ఇవ్వడానికి వెళ్లిన సచివాలయ ఉద్యోగులపై ఇదే ఎంపిడిఒ అనుచిత వ్యాఖ్యలు చేసిన విషయం తెలిసిందే. పాత్రికేయులను అవమానించే రీతిలో వ్యాఖ్యలు చేసిన ఎంపిడిఒపై చర్యలు తీసుకోవాలని సిపిఎం నాయకులు ప్రవీణ్‌కుమార్ డిమాండ్ చేశారు.

సోషల్ మీడియాలో ఆడియో వైరల్


ఎస్ఐకు ఫిర్యాదు చేస్తున్న పాత్రికేయులు

17న శ్రీకృష్ణదేవరాయలు వర్ధంతి

ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని వినతి

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

విజయనగర సామ్రాజ్య చక్రవర్తి శ్రీకృష్ణదేవరాయలు జయంతి, వర్ధంతి, పట్టాభిషేకం మహోత్సవాలను ప్రభుత్వ లాంఛనాలతో అధికారికంగా నిర్వహించాలని కోరుతూ శుక్రవారం రాయల సీమ బలిజ సంఘం ఉపాధ్యక్షులు చింతా దామోదర్ ఆధ్వర్యంలో డిఆర్ఒ సూర్యనారాయణరెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ నెల 17వ తేదీ శ్రీకృష్ణదేవరాయలు వర్ధంతిని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని కోరారు. అలాగే పట్టాభిషేక మహోత్సవం, జయంతి కార్యక్రమాలను నిర్వహించేలా చర్యలు తీసుకోవాలన్నారు. వినతి ఇచ్చిన వారిలో ముత్యాల కరుణాకర్, సుబ్బారావు, ఆంజనేయులు, మారుతిప్రసాద్, దాసరి శంకర్, అల్లాడి జయరాం, శ్రీనివాసులు, సతీష్, చంద్ర, కరణం సూరి, తోట వెంకటేష్, రఘుపతి, సత్య నారాయణ, మల్లికార్జున, మైలే శంకర్, మల్లికార్జున, కొత్తచెరువు, పుట్టపర్తి, బుక్కపట్నం, నల్లమాడ, మండలాల బలిజ సామాజిక వర్గం ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.


డిఆర్ఒకు వినతిపత్రం ఇస్తున్న బలిజ సంఘం నాయకులు

వితంతు పింఛను కాజేసిన వెల్ఫేర్ అసిస్టెంట్

ప్రజాశక్తి-నల్లచెరువు

నల్లచెరువులో ఓ వెల్ఫేర్ అసిస్టెంట్ రెండేళ్లుగా వితంతు పింఛను కాజేసిన విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాలు.. నల్లచెరువుకు చెందిన మెహతాజ్‌కు వితంతు పింఛను వచ్చేది. ఆమె ఉపాధి కోసం రెండేళ్ల క్రితం కువైట్ వెళ్లింది. అప్పటి నుంచి వెల్ఫేర్ అసిస్టెంట్ విజయ్‌కాంత్‌రెడ్డి ఆమె పింఛను మొత్తం తీసుకునే వాడు. గత నెలలో మెహతాజ్ కువైట్ నుంచి తిరిగి వచ్చి పింఛనుకు దరఖాస్తు చేసుకునేందుకు ఎంపిడిఒ కార్యాలయం వెళ్లగా అసలు విషయం వెలుగులోకి వచ్చింది. వెల్ఫేర్ అసిస్టెంట్ విజయ్‌కాంత్‌రెడ్డి సాధారణ బదిలీల్లో భాగంగా రెండు నెలల క్రితం అనంతపురం జిల్లాలోని గార్లదిన్నెకు బదిలీ అయ్యాడు. మెహతాజ్ పింఛనును కూడా గార్లదిన్నెకు బదిలీ చేయించుకున్నట్లు సమాచారం. మెహతాజ్ ఈ విషయంపై అధికారులకు ఫిర్యాదు చేయగా వారు ఈ విషయం బయటకు పొక్కకుండా ఆమెకు కొంత సొమ్ము ముట్టజెప్పినట్లు తెలుస్తోంది. వెల్ఫేర్ అసిస్టెంట్ విజయ్‌కాంత్‌రెడ్డి కొందరు వాలంటీర్లతో కలిసి వైసిపి పాలనలో కూడా లబ్ధిదారులకు తెలియకుండా సంక్షేమ పథకాలను కాజేసినట్లు విమర్శలు ఉన్నాయి. సంబంధిత ఉన్నతాధికారులు ఈ విషయంలో చొరవ చూపి అసలు విషయం తేల్చాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ఆలస్యంగా వెలుగులోకి..

'ఆశా' జిల్లా మహాసభలు జయప్రదం చేయండి

ప్రజాశక్తి-కదిరి టౌన్

పట్టణంలోని కోనేరు సర్కిల్‌లో ఉన్న ఎస్‌కె ఫంక్షన్ హాల్‌లో జరిగే ఆశా వర్కర్స్ రెండో జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని సిఐటియు అనుబంధ ఆశా వర్కర్ల యూనియన్ నాయకులు సాంబశివ కోరారు. పట్టణంలోని సిఐటియు కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మహాసభలకు ముఖ్య అతిథిగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ధనలక్ష్మి హాజరవుతారన్నారు. మహాసభలో గడిచిన మూడేళ్లలో జరిగిన పోరాటాలపై సమీక్ష చేసుకొని న్యాయమైన సమస్యల పరిష్కారం కోసం భవిష్యత్తు ప్రణాళిక రూపొందిస్తామని తెలిపారు. 18 ఏళ్లుగా గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ప్రజలకు వైద్య సేవలు అందించడంలో కీలకపాత్ర పోషిస్తున్న ఆశాలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తింపు, కనీస వేతనాలు, ఆశా వర్కర్లకు సంబంధంలేని పనులు చేపించే అధికారులపై చర్యలు, ఇతర న్యాయమైన సమస్యలపై చర్చిస్తామన్నారు. సమావేశంలో యూనియన్ నాయకురాలు అంజనమ్మ గంగులమ్మ, రమాదేవి, నాగలక్ష్మి, రమణమ్మ, యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షులు బత్తల సాంబశివ, సిఐటియు నాయకులు కృష్ణనాయక్ పాల్గొన్నారు.

శ్మశానవాటిక సమస్య పరిష్కారం

ప్రజాశక్తి-కొత్తచెరువు

ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి ప్రత్యేక చొరవతో ఎట్టకేలకు కొత్తచెరువు మేజర్ గ్రామ పంచాయతీ శ్మశానవాటిక సమస్యకు శాశ్వత పరిష్కారం లభించింది. రెవెన్యూ అధికారులు శ్మశానవాటికకు కేటాయించిన స్థలాన్ని శుక్రవారం పల్లె పరిశీలిం చారు. ఆయన మాట్లాడుతూ మండల రెవెన్యూ అధికారులు ప్రత్యేక దృష్టి సారించి రైల్వే ట్రాక్ సమీపంలోని నల్లగుట్ట కొండ వద్ద ఉన్న 3.25 ఎకరాల ప్రభుత్వ అసైన్డ్ భూమిని శ్మశానవాటికకు కేటాయించారని తెలిపారు. శ్మశానవాటికకు వెళ్లడానికి దారి కూడా చూపారన్నారు. పల్లె వెంట తహశీల్దార్ బాలాంజనేయులు, ఎంపిడిఒ నటరాజు, ఇన్‌ఛార్జి పంచాయతీ కార్యదర్శి జనార్దన్‌రెడ్డి, టిడిపి టౌన్ కన్వీనర్ వలిపి శ్రీనివాసులు, మండల కన్వీనర్ రామకృష్ణ, టిడిపి నాయకులు శ్రీనివాసులు, లక్ష్మీనారాయణ, కాంట్రాక్టర్ లక్ష్మీనారాయణ, రాజు ఉన్నారు.


శ్మశానవాటిక స్థలాన్ని పరిశీలిస్తున్న పల్లె, అధికారులు

'ఎపిఆర్‌జెసి'లో ఖాళీ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి-పరిగి

మండలంలోని కొడిగెనహళ్లి గురుకుల కళాశాలలో ఖాళీ పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపల్ పి.ప్రమీలమ్మ తెలిపారు. 2025-26 విద్యా సంవత్సరానికి గానూ తాత్కాలిక ప్రాతిపదికన అధ్యాపకులుగా పని చేసేందకు ఈ నెల 13వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. అలాగే ఫిజిక్స్, కెమిస్ట్రీ లైబ్రేరియన్ పోస్టులు కూడా ఖాళీగా ఉన్నాయన్నారు. అభ్యర్థులు సంబంధిత సబ్జెక్టులో తప్పని సరిగా పిజి చేసి ఉండాలని, 50 శాతానికి పైగా మార్కులు పొంది ఉండాలని తెలిపారు. వివరాలకు 87126 25078లో సంప్రదించాలన్నారు.

గిరిజన గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలి

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

జిల్లా వ్యాప్తంగా గిరిజన గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరుతూ శుక్రవారం ఎస్టీ కమిషన్ మాజీ సభ్యులు వడిత్య శంకర్ నాయక్ కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్‌కు వినతిపత్రం సమర్పించారు. ఆయన మాట్లాడుతూ ఇప్పటికీ పలు గిరిజన గ్రామాల్లో రహదారులు, తాగునీరు, రవాణా, వీధి దీపాలు, పాఠశాల భవనాలు, తదితర మౌలిక సదుపాయాలు లేవన్నారు. గిరిజన సబ్ ప్లాన్ కింద మంజూరైన నిధులను గిరిజనుల అభివృద్ధికే వినియోగించాలన్నారు. గిరిజన కులాల్లో ఇతర కులాలను చేర్చే ప్రతిపాదనను ప్రభుత్వం విరమించుకోవాలన్నారు. గిరిజన నిరుద్యోగ యువతకు ఉపాధి, ఉద్యోగ కల్పనకు చిన్న పరిశ్రమలు ఏర్పాటు చేసుకునేలా తోడ్పాటు అందించాలన్నారు. గిరిజన పిల్లలకు నాణ్యమైన విద్య అందించేందుకు కేంద్రీయ విద్యాలయంతో పాటు ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్ ఏర్పాటు చేయాలన్నారు. ఆయన వెంట నారాయణనాయక్, ఆనంద్‌నాయక్, గోపాల్‌నాయక్, సురేంద్రనాయక్ ఉన్నారు.

ఉచిత వైద్య శిబిరం

రొద్దం : మండలంలోని చిన్నమంతూరు ప్రభుత్వ పాఠశాలలో శుక్రవారం హెచ్ఎం విమల, ఆమె సోదరుడు విజయ్‌కుమార్ అనంతపురంలోని ట్రినిటీ న్యూరో సైకియాట్రిక్ రిహాబిలిటేషన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో దాదాపు 10 మంది వైద్యులు పలువురికి వైద్యసేవలు అందించారని ఎంఇఒ-2 విజయభాస్కర్ తెలిపారు. అయితే వర్షం కారణంగా ఆ గ్రామం చుట్టుపల్లెల వారు హాజర కాలేకపోయారన్నారు. ఒక గ్రామంలోనే సుమారు 500 మందికి పైగా పలు సమస్యలతో రాగా వైద్యులు చికిత్స చేశారు. కార్యక్రమంలో రొద్దం ఎంఇఒ-1, 2, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మృతురాలి నేత్రాలు దానం

ధర్మవరం రూరల్ : పట్టణంలోని యాదవవీధికి చెందిన గూడూరు సరోజమ్మ(80) శుక్రవారం మృతిచెందారు. విషయం తెలిసిన వెంటనే విశ్వదీప సేవా సంఘం వ్యవస్థాపకులు కోళ్ల మొరం చంద్రశేఖర్‌రెడ్డి మృతురాలి ఇంటికి వెళ్లి ఆమె కుటుంబ సభ్యులకు నేత్రదానంపై అవగాహన కల్పించారు. వారి అంగీకారంతో జిల్లా అంధత్వ నివారణ సంస్థ, అనంతపురం రెడ్ క్రాస్ సొసైటీ కుళ్లాయప్ప, కంటి ట్రావెల్ సెంటర్ టెక్నీషియన్ రాఘవేంద్ర సరోజమ్మ నేత్రాలను సేకరించారు. నేత్రదానానికి సహకరించిన సరోజమ్మ కుమార్తెలు నాగవేణి, శ్రీదేవి, మంజుల, కైలాష్, మనవరాలు స్నేహదీపిక, దీక్షిత, మనవడు నిఖిల్, నిఖిలేశ్వర్‌కు విశ్వదీప సేవా సంఘం సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సురేష్, ఉపాధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి, రఘు పాల్గొన్నారు.

బ్యాంకుల వద్ద భద్రతా చర్యలు తీసుకోవాలి

తనకల్లు : మండలంలోని అన్ని బ్యాంకుల వద్ద పటిష్ట భద్రతా చర్యలు ఏర్పాటు చేసుకోవాలని ఎస్ఐ గోపి ఓ ప్రకటనలో సూచించారు. ఈ మేరకు శుక్రవారం ఆయన మండలంలోని ఎస్‌బిఐ, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఎపిజిబి బ్యాంకుల మేనేజర్లకు నోటీసులు ఇచ్చారు. బ్యాంకుల్లో సీసీ కెమెరాలు సక్రమంగా పని చేసేలా చూడాలని, భద్రతా సిబ్బందిని నియమించుకోవాలని, ఏదైనా జరిగితే అలారం వ్యవస్థ సక్రమంగా పని చేసేలా చూసుకోవాలని, అనుమానాస్పద వ్యక్తులు, లేదా కార్యకలాపాలు గమనించిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు.

రోడ్డు పనులు వేగవంతం చేయాలని వినతి

కొత్తచెరువు: కొత్తచెరువులో రోడ్డు పనులు వేగవంతం చేయాలని కోరుతూ శుక్రవారం డివిఎంసి సభ్యులు రామాంజనేయులు తహశీల్దార్ బాలాంజనేయులుకు వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ రోడ్డు నిర్మాణానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేయడంతో ఇటీవల ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి ఆ పనులను ప్రారంభించారని తెలిపారు. ఈ క్రమంలో పది రోజులుగా రోడ్డుకు ఓ వైపున మట్టి తవ్వకాల పనులు చేపట్టారన్నారు. ఈ పనులు ఆలస్యం కావడంతో రోడ్డుకు అటువైపు నివాసం ఉన్న ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. మూడు రోజులుగా భారీ వర్షాలు కురవడంతో వర్షం నీరు అందులో చేరడంతో రాకపోకలకు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. కావున ఆ పనులను కాంట్రాక్టర్ త్వరగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

క్రీడాకారులకు దుస్తులు పంపిణీ

కదిరి టౌన్ : ఉమ్మడి అనంతపురం జిల్లా గోల్‌షాట్ క్రీడాకారులకు శుక్రవారం రూరల్ మండల పరిధిలోని ఎరుకలవాండ్లపల్లి సమీపంలో ఉన్న హరీష్ పాఠశాలలో ప్రిన్సిపల్ ఎంఎస్.కిరణ్ క్రీడా దుస్తులు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ చిత్తూరు జిల్లా నేరేబైలులో శని, ఆదివారాల్లో జరిగే రాష్ట్ర స్థాయి గోల్ షాట్ బాల్ పోటీల్లో ఉమ్మడి అనంతపురం జిల్లా క్రీడాకారులు పాల్గొంటారని తెలిపారు. వారు విజయంతో తిరిగి రావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో జనరల్ సెక్రటరీ మనోహర్‌రెడ్డి, ఉమ్మడి అనంతపురం జిల్లా కార్యదర్శి ప్రసన్నకుమార్, రాష్ట్ర గోల్ షాట్ బాల్ డైరెక్టర్ నందిని, క్రీడాకారులు పాల్గొన్నారు.

సేంద్రియ ఎరువులతో అధిక దిగుబడి

బుక్కపట్నం : మల్బరీ పంట సాగు చేసే రైతులు సేంద్రియ ఎరువులు వాడి అధిక దిగుబడులు పొందాలని అనంతపురం ప్రాంతీయ పట్టు పరిశోధన కేంద్రం శాస్త్రవేత్తలు డాక్టర్ రమ్య, అసిస్టెంట్ డైరెక్టర్ అప్పలనాయుడు సూచించారు. 'నా పట్టు-నా అభిమానం' కార్యక్రమంలో భాగంగా శుక్రవారం వారు మండలంలోని బుచ్చయ్యగారిపల్లి గ్రామంలో పట్టు రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మల్బరీ పంట సాగు చేసే ముందు మట్టి పరీక్షలు తప్పనిసరిగా చేయించాలన్నారు. రసాయన ఎరువుల వాడకం తగ్గించి సేంద్రియ ఎరువులు అధికంగా వినియోగించాలని తెలిపారు. కార్యక్రమంలో సిరికల్చర్ అధికారులు వేణుగోపాల్, ప్రభాకర్, రైతులు పాల్గొన్నారు.

ఇసుక టిప్పర్, ట్రాక్టర్లు స్వాధీనం

బత్తలపల్లి : మండలంలో చిత్రావతి పరివాహక గ్రామాల నుంచి ఇసుకను అక్రమంగా తరలించడంపై ఆర్డీవో మహేష్ ప్రత్యేక దృష్టి సారించారు. ఈ మేరకు గురువారం రాత్రి ఆర్డీవో బత్తలపల్లి రెవెన్యూ, పోలీసు సిబ్బందితో కలిసి ఇసుక అక్రమ రవాణాపై దాడులు చేశారు. ఇసుక తరలించేందుకు సిద్ధంగా ఉన్న టిప్పర్, రెండు ఇసుక ట్రాక్టర్లను పట్టుకొని స్టేషన్‌కు తరలించారు. వాహన యజమానులపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ సోమశేఖర్ తెలిపారు. ఆర్డీవో వెంట ఎస్ఐ, దంపెట్ల వీఆర్వో నాగేంద్రబాబు, ఉన్నారు.

గిరిజన సంక్షేమ శాఖ హాస్టల్ తనిఖీ

నల్లమాడ : స్థానిక గిరిజన సంక్షేమశాఖ హాస్టల్‌ను శుక్రవారం మండల ప్రత్యేక అధికారి, డిఇఒ జి.క్రిష్టప్ప సందర్శించారు. విద్యార్థుల టాయిలెట్లు శుభ్రంగా ఉంచాలని, డార్మెంటరీకి మెస్ వేయించాలని, వాటర్ ట్యాంక్‌కు మూత వేయించాలని, నాణ్యమైన ఆహారం అందించాలని, పరిసరాలు శుభ్రంగా ఉంచాలని, వర్షా కాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని వార్డెన్లు ఆదేశించారు. ఆయన వెంట డిప్యూటీ ఎంపిడిఒ, పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది ఉన్నారు.

మెనూ ప్రకారం భోజనం అందించాలి

లేపాక్షి : విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని తహశీల్దార్ సౌజన్యలక్ష్మి హాస్టల్ వార్డెన్‌ను ఆదేశించారు. ఆమె శుక్రవారం మండలంలోని కంచిసముద్రం బాలుర వసతి గృహాన్ని సందర్శించారు. విద్యార్థుల హాజరు, భోజనం, రికార్డులను తనిఖీ చేశారు. విద్యార్థులతో సమావేశం నిర్వహించి భోజనం, వసతులపై అడిగి తెలుసుకున్నారు. ఆమె వెంట గ్రామ రెవెన్యూ అధికారిణి గంగరత్నమ్మ, హాస్టల్ సిబ్బంది చాంద్‌బాషా, రవి, రవికుమార్, పురుషోత్తంరెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు

తల్లీకూతుళ్లు తల్లిదండ్రులకు అప్పగింత

ప్రజాశక్తి-బత్తలపల్లి

ఓ వివాహిత తన ఇద్దరు కూతుళ్లతో కలిసి పుట్టింటి నుంచి వెళ్లిపోగా పోలీసులు వారి ఆచూకీని కనిపెట్టి తల్లిదండ్రులకు అప్పజెప్పారు. పోలీసులు తెలిపిన వివరాలు.. అత్తగారింటికి వెళ్లడం ఇష్టం లేని బత్తలపల్లికి చెందిన భాగ్యలక్ష్మి తన కూతుళ్లు జాహ్నవి, యశ్వినితో కలిసి ఈ నెల 6వ తేదీ ఇంటి నుంచి వెళ్లిపోయింది. భాగ్యలక్ష్మి తల్లి గోగుల అరుణ ఫిర్యాదు మేరకు పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసి గాలింపు చర్యలు చేపట్టారు. భాగ్యలక్ష్మి కూతుళ్లతో పాటు తిరుమలలో ఉన్నట్లు గుర్తించి వారిని స్టేషన్‌కు తీసుకొచ్చారు. సోమవారం స్టేషన్‌లో ఆమె తల్లిదండ్రులకు అప్పగించారు. కార్యక్రమంలో ఎస్ఐ సోమశేఖర్, కానిస్టేబుళ్లు నారాయణస్వామి, నరేష్ పాల్గొన్నారు.

మడకశిర అర్బన్ సిఐగా సుబ్రహ్మణ్యం

ప్రజాశక్తి-మడకశిర రూరల్



మడకశిర అర్బన్ సిఐగా సుబ్రహ్మణ్యం శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన మాట్లాడుతూ సర్కిల్ పరిధిలో పటిష్ట నిఘా ఉంచుతామన్నారు. ఎక్కడా ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా చర్యలు తీసుకుంటామన్నారు. ఎల్లవేళలా ప్రజలకు అందుబాటులో ఉంటామని, శాంతిభద్రతలను కాపాడుతామని తెలిపారు.

రేషన్ బియ్యం పట్టివేత

గాండ్లపెంట : గ్రామాల్లో లబ్ధిదారుల నుంచి సేకరించి అక్రమంగా తరలిస్తున్న చౌక బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు తహశీల్దార్ బి.బాబురావు తెలిపారు. ఓ ఆటోలో నంబులపూలకుంట నుంచి శుక్రవారం చౌక బియ్యాన్ని అక్రమంగా తరలిస్తుండగా ధనియానిచెరువు వద్ద విఆర్ఒ అడ్డగించారు. అయితే వారు విఆర్ఒను పక్కకు తోసి కదిరికి వెళ్తున్న సమయంలో ఆర్ఐ జాఫర్, విఆర్ఒ రమణ ఆటోను ఆపి బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఆటోను, బియ్యాన్ని స్థానిక పోలీస్ స్టేషన్‌లో అప్పగించారు.

సిఎం, డిప్యూటీ సిఎం, మంత్రి చిత్రపటాలకు పాలాభిషేకం

ప్రజాశక్తి-పరిగి

మండలంలోని యానిమేటర్లు శుక్రవారం స్థానిక ఎంపిడిఒ సిఎం చంద్రబాబు, డిప్యూటీ సిఎం పవన్‌కళ్యాణ్, మంత్రి సవిత చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. గత ప్రభుత్వ హయాంలో యానిమేటర్లను మూడేళ్లకు ఓమారు రెన్యువల్ చేసే ప్రక్రియను తీసుకురాగా, కూటమి ప్రభుత్వం రెగ్యులరైజ్ చేసేందుకు ముందుకు రావడంతో వారు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ ఎస్ఎన్.గోవిందరెడ్డి, బాలాజీ, యానిమేటర్లు, నాయకులు పాల్గొన్నారు.